ఇన్ ఫ్లో మూసేసి...అవుట్ ఫ్లో ఎత్తు పెంచేసి..!

- అనాలోచిత నిర్ణయాలతో ముంపు సమస్య
- కొండప్ప చెరువు పరిసర గ్రామాల ప్రజలకు తప్పని అవస్థలు


సంగివలస రోడ్డులో చెరువు ఇన్‌ఫ్లో వద్ద తక్కువ సామర్థ్యం కలిగిన పైపులు


సంగివలస కాలనీ వైపు ఎత్తు పెంచిన అవుట్ ఫ్లో ప్రాంతం

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు సంగివలస కొండప్ప చెరువుకు అనుసంధానంగా ఉన్న ఇన్‌లెట్, అవుట్‌లెట్ల గమనాన్ని మార్చి చుట్టుపక్కల గ్రామాల ముంపునకు పరోక్షంగా దివీస్ లేబొరేటరీ, దేవదాయ శాఖ, మత్స్యశాఖ, ఇరిగేషన్, జీవీఎంసీ కారణమయ్యాయి. గతంలో చేసిన తప్పును కప్పిపుచ్చుకోవడానికి ఇప్పుడు చెరువుకు సంబంధం లేకుండా చుట్టూ డ్రైనేజీలు తవ్వుతూ సర్కస్ ఫీట్లు చేస్తున్నారు. వీరు మురుగునీరు పోయేందుకు చేస్తున్న ప్రత్యామ్నాయ ప్రయత్నాలన్నింటికీ ఆయా గ్రామస్తులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. పూర్వం వలే చెరువుకు ఉన్న రెండు ఇన్ ఫ్లో ద్వారాలను ఆధునికీకరించి, రెండు అవుట్ ఫ్లో మార్గాల ఎత్తు తగ్గించి చెరువులో మిగులు జలాలను బాలాజీ నగర్ గెడ్డకు అనుసంధానంగా మళ్లించాలని కోరుతున్నారు.

దివీస్ యాజమాన్యం తప్పుడు నిర్ణయాలతో...

దేవదాయశాఖ సంగివలస కొత్తమ్మతల్లి ఆలయానికి చెందిన 14.2 ఎకరాల్లో కొండప్ప చెరువును అభివృద్ధి చేసి పార్కులు నిర్మిస్తామని రూ.2.25 కోట్లతో దివీస్ యాజమాన్యం అయిదేళ్ల క్రితం రంగంలోకి దిగింది. ముందుగా తగరపువలస హైవేను ఆనుకుని సర్వీస్ రోడ్డు వద్ద తూర్పు భాగాన ఉన్న ఇన్‌ఫ్లో మొత్తం మూసివేసి నామమాత్రంగా పైపులు వేసి దానిపై వాకింగ్ ట్రాక్ నిర్మించింది. ఈశాన్యంలో అవుట్‌ఫ్లో మార్గాన్ని డమ్మీగా మార్చివేసింది. అలాగే ఉత్తర దిక్కున సంగివలస కాలనీవైపు అవుట్‌లెట్‌ను మూడు అడుగులు పెంచి మదుము నిర్మించింది. దీంతో తగరపువలస, సబ్బివానిపేట, ఆదర్శ నగర్ తదితర గ్రామాల నుంచి వచ్చే మురుగు, వర్షం నీరు చెరువులోకి కాకుండా రోజుల తరబడి రోడ్లపై నిలిచిపోతోంది. దీనికితోడు జాతీయ రహదారుల నిర్మాణ సమయంలో డ్రైనేజీల్లో నిండిపోయిన ఫ్లైయాష్ పూడిక ప్రవాహానికి ఇబ్బందికరంగా మారిపోయింది. అలాగే ఇటీవల జీవీఎంసీ సంగివలస శివాలయం వైపు నిర్మించిన డ్రైనేజీలు లోపభూయిష్టంగా ఉండడంతో అక్కడి సత్యకల్యాణి లేఅవుట్ వైపు ప్రైవేట్ స్థలాలు మురుగు ముంపు గుప్పిట్లో విలవిలలాడుతున్నాయి.

'నీరు పల్లమెరుగు' నిజాన్ని దాచి...

స్థానిక అధికారులు నీరు పల్లమెరుగు అన్న నిజాన్ని ఉన్నతాధికారుల వద్ద దాచి మభ్య పెడుతున్నారు. వ్యాధి ఒకచోట వస్తే వైద్యం మరొకచోట అన్నట్టు ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో ప్రదేశాల్లో లోపాలు కనపడుతున్నా మురుగు, వర్షం నీరు గమనాన్ని మార్చడానికి నానాపాట్లు పడుతున్నారు. ముందుగా చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్, శ్రీబాసర లే అవుట్‌లలో డ్రైనేజీలు తవ్వి అభాసుపాలయ్యారు. ఇప్పుడు చెరువు గట్టును ఆనుకుని ఏకంగా పది అడుగుల లోతు డ్రైనేజీ తవ్వి మురుగు, వర్షం నీటిని సత్యకల్యాణి లే అవుట్ వద్ద ప్రైవేట్ స్థలాల్లోకి వదులుతామని అంటున్నారు. ఈ ప్రయత్నాలకు కూడా స్థానికులు అడ్డు తగిలారు. దీనివల్ల భవిష్యత్‌లో చెరువుకు గండ్లు పడి, వాకింగ్ ట్రాక్ నిర్మాణం శిథిలమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. రూ.3 కోట్లు వృథా చేసే బదులు పూర్వం నుంచి ఉన్న ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో మార్గాలను ఆధునికీకరించి సరిచేయాలని చెరువు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


సత్యకల్యాణి లే అవుట్ వద్ద ప్రైవేట్ స్థలాల్లో నిలిచిపోయిన మురుగునీరు


చెరువు గట్టును ఆనుకుని ప్రత్యామ్నాయంగా తవ్వుతున్న కాలువ

కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి


స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పీఎం పాలెం: జీవీఎంసీ 8వ వార్డు మిథిలాపురి వుడా కాలనీ వాసులకు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పార్కు సమావేశ మందిరంలో మిథిలాపురి వుడా గృహ సముదాయపు సభ్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న సమస్యలపై ఆయన చర్చించారు. విద్యుత్ సరఫరా సరిగా ఉండడం లేదని, చిన్నపాటి వర్షం కురిసినా కాలనీలో పలుచోట్ల నీరు నిలిచిపోతోందని, దోమల వ్యాప్తి అధికంగా ఉందని స్థానిక మహిళలు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా చెత్త పోగులు కాలనీలో పేరుకు పోతున్నాయన్నారు. అలాగే వుడా కాలనీ ప్రధాన రహదారి నుంచి పార్కు పక్కగా వెళ్లే 60 అడుగుల రోడ్డు పూర్తి స్థాయిలో నిర్మించలేదన్నారు. స్పందించిన ఎమ్మెల్యే పారిశుధ్య, విద్యుత్ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు నిర్మాణానికి సంబంధించి అడ్డంకులపై అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జెడ్పీ కనక మహాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ 5, 7 వార్డుల అధ్యక్షులు పోతిన హనుమంతరావు, శ్రీనివాసరావు, నాయకులు వాండ్రాసి రవి, పిల్లా సూరిబాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

15వ నంబరు రేషన్ డిపోపై 6ఎ కేసు ఎత్తివేత

తగరపువలస: స్థానిక సంతబయలు రహదారిలో ఉన్న 15వ నంబరు రేషన్ డిపోపై 6ఎ కేసు ఎత్తివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పాస్ యంత్రంతో పోల్చి చూడగా రేషన్‌డిపోలో 30 కిలోల బియ్యం తక్కువగా ఉన్నట్టు చూపించి డీలర్ ఉప్పలచిన వెంకటరమణకు మే రెండో వారంలో నోటీసు జారీ చేసినట్టు అప్పటి సీఎస్‌డీటీ కృష్ణారావు తెలిపారు. అప్పుడే సరకుల కాటాతో పాటు ఈ పాస్ యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీంతో డీలర్ కోర్టును ఆశ్రయించడంతో అదే డీలర్‌తో డిపోను నడిపించడానికి ఉత్తర్వులు జారీ చేసినట్టు ఆయన తెలిపారు.

బొట్టవానిపాలెంలో జ్ఞాన ధర్మ ప్రచారం

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు బొట్టవానిపాలెం, అయ్యప్పనగర్ పరిసర ప్రాంతాల్లో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో భగవద్గీతపై ఆదివారం ప్రచారం చేశారు. గురు పౌర్ణమిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేపట్టినట్టు కమిటీ అధ్యక్షుడు త్రినాథరావు, సభ్యులు తెలిపారు.

మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి


కుళాయి ప్రారంభిస్తున్న సర్పంచ్ లక్ష్మి

ఆనందపురం : పంచాయతీలో మంచినీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ చందక లక్ష్మి చెప్పారు. పంచాయతీ పరిధిలోని బేడ బుడగ జంగాల కాలనీలో ఏర్పాటు చేసిన మంచినీటి కుళాయిలను ఆమె ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొండపై సుమారు 30 జంగాల కుటుంబాలు నివసిస్తున్నాయని, వారికి తాగునీటి సమస్య ఉందని ఇటీవల తెలియజేయడంతో వెంటనే చర్యలు తీసుకున్నామని చెప్పారు. నాయకులు పీనగం చిన్న రామారావు, చందక శంకర్, హైస్కూల్ చైర్మన్ చందక అప్పల నాయుడు, మేడిశెట్టి రాంజీ పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ


సర్టిఫికెట్లతో విద్యార్థులు, కోచ్‌లు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు ఆదర్శనగర్‌లో మే నెల నుంచి ఈ నెల 5 వరకు నిర్వహించిన మార్షల్ ఆర్ట్స్ వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు ఆదివారం టీ షర్టులు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బ్లాక్ బెల్ట్ గ్రహీతలు, కోచ్‌లు బంగారు పరదేశి, బంగారు గౌతమ్ మాట్లాడుతూ ఇటీవల శిక్షణ పూర్తి చేసుకున్న వారికి జీవీఎంసీ పరిధిలో పోటీలు నిర్వహించినప్పుడు తమ విద్యార్థులు గట్టి పోటీ ఇచ్చారన్నారు. పీఎస్ఆర్ మార్షల్ ఆర్ట్స్ శిక్షణ సంస్థ ప్రతినిధులు పి.నరసింహారావు, శివరామకృష్ణ, స్థానిక ప్రతినిధులు తమ్మిన అశోక్, జీరు శ్రీనివాసరెడ్డి, కోన సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

వామనావతారంలో జగన్నాథుడు



భీమునిపట్నం: భీమిలిలో జరుగుతున్న జగన్నాథ స్వామి రథోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారు వామనావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆర్.సింగరాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు భక్తులకు అవతార విశిష్టతను వివరించారు.

ఎమ్మెల్యే మాటిచ్చారు.. బస్సు ప్రారంభించారు


శంభువానిపాలెం గ్రామానికి బస్సు సర్వీసు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పీఎం పాలెం: ఆ గ్రామం మహా విశాఖ నగర పరిధిలో భాగమే అయినప్పటికీ ఇంతవరకూ ఆర్టీసీ బస్సు సదుపాయానికి నోచుకోలేదు.. గ్రామం నుంచి బయటి ప్రపంచంలోకి వెళ్లాలంటే రాత్రి అయినా పగలైనా రానూపోనూ 10 కిలోమీటర్ల దూరం అడవి మార్గంలో నడవాల్సిందే.. ఇక జీవీఎంసీ ఆరో వార్డులోని శంభువానిపాలెంలో నివసిస్తున్న 80 గిరిజన కుటుంబాలకు ఇబ్బందులు తప్పనున్నాయి... గతంలో ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, 6వ వార్డు కార్పొరేటర్ లక్ష్మీ ప్రియాంక పీఎం పాలెం ఆఖరు బస్టాపు నుంచి శంభువానిపాలెం గిరిజన గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీసును ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ సిటీ బస్సు ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఆదర్శంగా తీసుకుని పని చేస్తున్నామన్నారు. గ్రామంలో పారిశుధ్యం మెరుగుపరిచి, ఇతర సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మద్దిలపాలెం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎన్.అరుణ కుమారి, రాష్ట్ర నగరాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లా సుజాత, జెడ్పీ కనక మహాలక్ష్మి, వైఎస్సార్ సీపీ 6వ వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, నాయకులు గాదె రోశిరెడ్డి, సింహాచలం ట్రస్టు బోర్డు సభ్యులు రాజేశ్వరి, పోతిన ప్రసాదు, యల్లాజీ, పోతిన సూరిబాబు, సియాద్రి కనకరాజు, సంజీవ్, నరసింహారావు, జామి శివ పాల్గొన్నారు.

300 మందికి ఉచిత నేత్ర వైద్య పరీక్షలు


నేత్ర వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు సచివాలయం వద్ద హెల్పింగ్ హేండ్స్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 300 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 40 మందికి శస్త్ర చికిత్సలు, వంద మందికి కంటి అద్దాలు అవసరమని నిర్ణయించారు. కనకల అప్పలనాయుడు ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన శిబిరంలో హెల్పింగ్ హేండ్స్ వ్యవస్థాపకుడు పల్లంటి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా 'జగనన్న సురక్ష' నిర్వహణ


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ హనుమంతురావు

మధురవాడ: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ అర్హులందరికీ అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న జగనన్న సురక్ష ఎంతో ఉపయోగపడుతుందని, దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు సూచించారు. జీవీఎంసీ 5వ వార్డులోని వైఎస్సార్ సీపీ నాయకులు, గృహ సారథులతో మధురవాడలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్షను విజయవంతం చేసేందుకు గృహ సారథులు, నాయకులు తక్షణమే ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారుల వివరాలు సేకరించాలని సూచించారు. అర్హతున్నా పథకాలు ఎందుకు అందలేదో తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోతిన సురేష్‌కుమార్, జీఎస్ రెడ్డి, ఎన్.బాబ్జీ, బండారు శివ లక్ష్మి, కల్లేపల్లి శంకరరావు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రధాని ధ్యేయం

పద్మనాభం: పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రధాని నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలన సాగించారని బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవి కుమార్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల సేవా సుపరిపాలన, పేదల సంక్షేమంపై ఇంటింట ప్రచారాన్ని కుంతీ మాధవ స్వామి ఆలయం వద్ద ఆదివారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ మహిళా పోషణ్ అభియాన్, మాతృ వందన యోజన, ఉజ్వల భారత్,"సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాలు ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు ఉప్పాడ అప్పారావు, ఆర్.శ్రీనివాసరావు, పి.కృష్ణారావు, హెచ్.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం

భీమునిపట్నం: ప్రధాని నరేంద్ర మోదీ తొమ్మిది సంవత్సరాల పాలన పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై జీవీఎంసీ 3వ వార్డులో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షురాలు కంటుభుక్త సునీత అధ్యక్షతన ఆదివారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ఎన్నో మంచి పనులు చేపట్టిందన్నారు. నాయకులు అప్పికొండ ఆదినారాయణ, పోతుబోతు విజయ, చెన్నారాము, డొరక లక్ష్మి పాల్గొన్నారు.

ఆనందపురం వైద్యాధికారిగా గంగునాయుడు

ఆనందపురం : ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన వైద్యాధికారిగా గంగునాయుడు నియమితులయ్యారు. ఆయన పశ్చిమ గోదావరి జిల్లా అల్లుమూరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చి ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న కోరాడ శైలజ విజయనగరం ఘోషా ఆస్పత్రికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా గంగునాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కుటుంబ డాక్టర్ విధానాన్ని మండలంలో పక్కాగా అమలు జరపడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అన్ని గ్రామాల ప్రజలకు వైద్య సేవలు సక్రమంగా అందేటట్టు సిబ్బందిని సమాయత్తం చేస్తామని వివరించారు.

మరో ఇద్దరికి బదిలీ : ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న ఐ.గోవిందరావుని కేజీహెచ్‌కు బదిలీ చేశారు. అక్కడ ఆయనను హెల్త్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. ఆయన స్థానంలోకి కృష్ణ మోహన్ బదిలీపై వచ్చారు. స్టాఫ్ నర్స్ సుగుణకు బదిలీకాగా ఆమె స్థానంలో రాజేశ్వరి నియమితులయ్యారు.

ముఖద్వారం నిర్మాణానికి చర్యలు


మాట్లాడుతున్న గోపాలకృష్ణమూర్తి రాజు

పద్మనాభం: అనంత పద్మనాభ స్వామి సేవా సంఘం ద్వారా సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామని ఆ సంఘ అధ్యక్షుడు డి.గోపాలకృష్ణమూర్తి రాజు పేర్కొన్నారు. పద్మనాభంలో ఆయన అనంత పద్మనాభ స్వామి సేవా సంఘం కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో భాగంగా అనంత పద్మనాభుని ఘాట్ రోడ్డులో ముఖద్వారం నిర్మిస్తామన్నారు. అనంత పద్మనాభుని తెప్పోత్సవం నిర్వహించే కోనేరును అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మరగడ అప్పారావు, ఆదినారాయణ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


కృష్ణానగర్‌లో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారి ఇంటి వద్దకే అందించాలన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆకాంక్ష అని, ప్రతి ఒక్కరూ అందుకు అనుగుణంగానే పనిచేయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెప్పారు. జీవీఎంసీ 7వ వార్డు చంద్రంపాలెం 62వ వార్డు నంబరు సచివాలయం పరిధిలోని కృష్ణానగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం మధ్యాహ్నం నిర్వహించారు. ఇక్కడి అపార్ట్‌మెంట్ల వద్దకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని ప్రభుత్వం ద్వారా పలు సంక్షేమ పథకాలు అందుకున్న లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు. స్థానిక నివాసి పడాల లక్ష్మణరావు కుటుంబానికి వైఎస్సార్ ఆసరా, అమ్మ ఒడి, వైఎస్సార్ సున్నా వడ్డీ తదితర పథకాల ద్వారా రూ.6 లక్షల లబ్ధి చేకూరిందని కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఆయా ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా నిర్వహించాలని, వీధిలైట్లు వెలిగించాలని, ఆకతాయిల బెడద తప్పించాలని తదితర సమస్యలు ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడంలో ఎదురయ్యే ఇబ్బందులు తొలగించాలని, ఆ బాధ్యత అధికారులు, సిబ్బందిదే అని పేర్కొన్నారు. ఈ విషయంలో ఎవరికైనా ఇబ్బందులు వుంటే రాజీనామా చేయాలని, బదిలీకి సిద్ధమవ్వాలని అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లను ఘాటుగా హెచ్చరించారు.

కార్యక్రమంలో జెడ్పీ కె.కనకమహాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, సింహాచలం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యుడు పీకేఎమ్ పాత్రుడు, వాండ్రాసి రవికుమార్, పిల్లా సూరిబాబు, జగ్గుపిల్ల నరేష్, డాక్టర్ సూర్యనారాయణ, చేకూరి రజని, తమ్మినేని వరలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా ఏసు తిరు హృదయ మహోత్సవం


ప్రసంగిస్తున్న రెవరండ్ బిషప్ మల్లవరపు ప్రకాశ్

భీమునిపట్నం: భీమిలిలోని రోమన్ క్యాథలిక్ చర్చిలో ఆదివారం ఏసు తిరు హృదయ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ అగ్ర పీఠాధిపతులు రెవరెండ్ బిషప్ డాక్టర్ మల్లవరపు ప్రకాశ్ మాట్లాడుతూ డచ్ వారు నిర్మించిన ఈ పురాతన చర్చికి ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. ఇక్కడ ఇటువంటి పవిత్ర కార్యక్రమం నిర్వహించడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఏసు ప్రభువు కరుణామయుడని కొనియాడారు. అనంతరం ఏసు విగ్రహాన్ని వీధుల్లో ఊరేగించారు. రెవరెండ్ ఫాదర్ సరిసా ప్రసాద్, రెవరెండ్ ఫాదర్ పరంజ్యోతి, రెవరెండ్ ఫాదర్ మాడుగుల డేవిడ్ రాజు, చర్చి ఫాదర్ వై.అల్ఫోన్స్ పాల్గొన్నారు.

నియామక పత్రాల అందజేత

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ, రుషికొండ, సాగర్‌నగర్, గుడ్లవానిపాలెం ప్రాంతాల్లో నూతనంగా నియమించిన పది మంది వలంటీర్లకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదివారం నియామక పత్రాలు అందజేశారు. శ్రీ కనక మహాలక్ష్మి దేవస్థానం బోర్డు మెంబర్ వంకాయల మారుతీ ప్రసాద్, లొడగల రామ్మోహన్, ఉప్పులూరి గోపి, మాదు బుజ్జి పాల్గొన్నారు.

నేడు 'జగనన్న సురక్ష'

పద్మనాభం: బాందేవుపురంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ చెప్పారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు హాజరుకానున్నారని తెలిపారు.

విచ్చలవిడిగా పశువుల సంచారం


కార్‌షెడ్ కూడలిలో వాహనాల రాకపోకలకు ఆటంకంగా నిలిచిన పశువులు

పీఎం పాలెం: రహదారులపై విచ్చలవిడిగా సంచరిస్తున్న పశువులతో తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. అడపాదడపా ప్రమాదాలు జరుగుతున్నాయి. కొంతమంది పశువుల యజమానుల నిర్లక్ష్యమే ఇందుకు కారణం. జీవీఎంసీ అధికారులు రోడ్లపై తిరిగే పశువులను వాహనాల్లో ఎక్కించి ఆరిలోవలోని బందెల దొడ్డుకు తరలిస్తున్నారు. పశువులను విచ్చలవిడిగా వదిలి పెడుతున్న వాటి యజమానులకు జరిమానాలు విధిస్తున్నారు. అయినప్పటికీ పరిస్థితిలో మార్పు రాలేదు. కార్‌షెడ్ కూడలిలో వాహనాల రాకపోకలకు ఆటంకంగా పశువులు సంచరిస్తున్నాయి. పీఎం పాలెం ఆఖరి బస్‌స్టాప్‌నకు వెళ్లే ప్రధాన రహదారిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి రోడ్లపై పశువుల సంచారం నియంత్రణకు తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు


శిల్పారామంలో నృత్యం చేస్తున్న కళాకారులు

పీఎం పాలెం : వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం 6 గంటలకు ప్రదర్శించిన కూచిపూడి, జానపద నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. శ్రీకాకుళానికి చెందిన శ్రీ నటరాజ నాట్య మండలి వారిచే ప్రదర్శన వినాయకకౌత్వం నృత్యాంశంతో ప్రారంభమైంది. కళాకారులు జాస్మిత, స్నేహ, సింధు, మహిశ్రీ, హాసిని, వర్షిత నృత్యం చేయగా ఈ.బిందుమహేశ్వరి నృత్య దర్శకత్వం వహించారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజా కార్యక్రమాల్లో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.